క్లుప్తంగా

లక్ష్మీనరసింహస్వామికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో లక్ష్మీనరసింహస్వామి మూలవిరాట్

ప్రొద్దుటూరు కల్చరల్ : మండలంలోని నరసింహాపురంలో వెలసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శుక్రవారం స్వామివారి జన్మనక్షత్రమైన స్వాతి పర్వదినం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. వేకువజామున స్వామి, అమ్మవారి మూలవిరాట్‌లకు విశేష అభిషేకాలు, అర్చనలు చేసి ప్రత్యేకంగా పట్టు వస్త్రాలు, వెండి కవచాలు, రంగురంగుల పూలతో అలంకరించారు. భక్తులు ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

రేపు ప్రభుత్వ ఉద్యోగాలపై ఉచిత మోడల్ టెస్ట్

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక సృజన్స్ కోచింగ్ సెంటర్‌లో ఆదివారం ఉదయం 9 నుంచి 11 గంటల వరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలపై అవగాహన, ఉచిత మోడల్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు కోచింగ్ సెంటర్ డైరెక్టర్ సృజన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మోడల్ టెస్ట్‌లో ప్రథమ స్థానంలో నిలిచిన వారికి రూ.3 వేల నగదు, ఉచిత కోచింగ్, ద్వితీయ బహుమతి రూ.1500, ఉచిత కోచింగ్ ఇస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

రాజుపాళెం : ఈ నెల 13న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి రాజుపాళెంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను శుక్రవారం ట్రైనీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కృష్ణ, జమ్మలమడుగు ఆర్డీఓ శ్రీనివాసులు పరిశీలించారు. ఓటర్లకు ఏర్పాటు చేసిన వసతుల గురించి తహసీల్దార్ ఇందిరా రాణిని వారు అడిగి తెలుసుకున్నారు. ఆ కేంద్రంలో పోలింగ్ అధికారులకు, ఓటర్లకు ఎటువంటి కొరత లేకుండా చూడాలని సూచించారు. కార్యక్రమంలో మండల ఇన్‌చార్జి ఆర్‌ఐ అశోక్, సర్వేయర్ గురుశేఖర్‌రెడ్డి, వీఆర్‌ఓలు కృష్ణమూర్తి, ఎల్లారెడ్డి, వీఆర్‌ఏలు పాల్గొన్నారు.

ఫ్యామిలీ ఫిజీషియన్ తనిఖీ

మైదుకూరు : మండలంలోని అక్కులాయపల్లెలో శుక్రవారం నిర్వహించిన ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని అదనపు డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఖాదర్‌వలీ తనిఖీ చేశారు. కార్యక్రమంలో గర్భిణులు, బాలింతలకు, కుష్ఠు, టీబీ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించి వైద్యం అందించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ వి.మల్లేష్, డీపీఎంఓ లక్ష్మీపతి, టీబీ కో–ఆర్డినేటర్ శంకర్, సీహెచ్‌ఓ సుబ్బరాయుడు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

మైదుకూరు : మున్సిపాలిటీ పరిధిలోని నానుబాలపల్లెలో శుక్రవారం ఓ ఇంటిలో నిల్వ ఉంచిన 24 బస్తాల రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు పట్టుకున్నారు. ఖాజీపేటకు చెందిన శ్రీనివాసులు అనే వ్యక్తి మైదుకూరులో నివాసం ఉంటూ రేషన్ బియ్యాన్ని అక్రమ రవాణాకు నిల్వ చేసినట్టు అర్బన్ ఎస్‌ఐ మద్దిలేటి తెలిపారు. శ్రీనివాసులుపై కేసు నమోదు చేసి, రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకొన్నట్టు ఎస్‌ఐ పేర్కొన్నారు.

అనాథలు, అభాగ్యులకు అండగా ఉండాలి

– హ్యాపీ ఫౌండేషన్‌ను ప్రారంభించిన ఏఎస్పీ ప్రేరణ కుమార్



ఫౌండేషన్‌ను లోగోను ప్రారంభిస్తున్న ఏఎస్పీ ప్రేరణ కుమార్

చాపాడు : అనాథలు, అభాగ్యులకు స్వచ్ఛంద సేవా సంస్థలు అండగా ఉండాలని ఏఎస్పీ ప్రేరణ కుమార్ పేర్కొన్నారు. ప్రొద్దుటూరులోని పోలీసు సబ్ డివిజనల్ కార్యాలయంలో శుక్రవారం రాత్రి చాపాడు మండలంలోని అన్నవరం గ్రామానికి చెందిన శ్రీ రామ వంశీ ఏర్పాటు చేసిన హ్యాపీ ఫౌండేషన్ స్వచ్ఛంద సేవా సంస్థ లోగోను ఏఎస్పీ ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రొద్దుటూరు ప్రభుత్వ వైద్యాధికారి వీరేంద్రనాథ్‌రెడ్డి, సురక్ష బ్లడ్ బ్యాంకు చైర్మన్ ఓబులరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించండి



36వ వార్డులో ఇంటింటికి వెళ్లి ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి



బద్వేలులోని టీచర్స్‌కాలనీలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధ



పర్లపాడులో ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



బ్రహ్మంగారిమఠం: ఎన్నికల ప్రచారం చేస్తున్న నాయకులు

ప్రొద్దుటూరు : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేస్తున్న పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డిని గెలిపించాలని కోరుతూ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి ఓటర్లను అభ్యర్థించారు. శుక్రవారం ప్రొద్దుటూరు మున్సిపాలిటీ పరిధిలోని 36వ వార్డులో ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి పట్టభద్రులైన ఓటర్లను కలిశారు. హైకోర్టు న్యాయవాదిగా పని చేస్తున్న వెన్నపూస రవీంద్రారెడ్డి అన్ని విధాలా సమర్థుడని, ఆయనకు ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల బ్యాలెట్ పత్రంలోని వరస సంఖ్య 3లో వెన్నపూస రవీంద్రారెడ్డికి పోలింగ్ అధికారులు ఇచ్చిన పెన్నుతో మొదటి ప్రాధాన్యత ఓటు (1) వేయాలని కోరారు. ఈ నెల 13న ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు మాత్రమే జరుగుతుందని తెలిపారు. పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి ఎంవీ రామచంద్రారెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ అలవలపాటి అరుణాదేవి, వార్డు ఇన్‌చార్జి కాకర్ల నాగశేషారెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి, కౌన్సిలర్లు చింపిరి అనిల్‌కుమార్, గంజికుంట రామసుబ్బమ్మ, వైఎస్సార్‌సీపీ ప్రొద్దుటూరు మండల కన్వీనర్ మార్తల ఓబుళరెడ్డి, మాజీ సర్పంచ్ గోపిరెడ్డి రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

సమష్టిగా కృషి చేయాలి

రాజుపాళెం : పశ్చిమ రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపరిచిన అభ్యర్థులు వెన్నపూస రవీంద్రారెడ్డి, రామచంద్రారెడ్డిల విజయానికి సమష్టిగా కృషి చేయాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గుద్దేటి రాజారాంరెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు ప్రవల్లిక, సచివాలయ కన్వీనర్లు వెలవలి శేఖర్‌రెడ్డి, పరిమళ కోరారు. మండలంలోని రాజుపాళెం, పర్లపాడు, చిన్నశెట్టిపల్లె గ్రామాల్లో వారు శుక్రవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఇంద్రసేనారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, గౌతమ్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, జగదీశ్వరరెడ్డి, శివశంకర్‌రెడ్డి, హరిశ్చంద్రారెడ్డి, సొసైటీ చైర్మన్ బాల నాగిరెడ్డి, కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించండి

– ఎమ్మెల్యే డాక్టర్ సుధ

బద్వేలు అర్బన్ : ఈ నెల 13న జరిగే పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి ఎం.వి.రామచంద్రారెడ్డిలకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఎమ్మెల్యే డాక్టర్ సుధ పేర్కొన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం పట్టణంలోని టీచర్స్‌కాలనీలో ఎమ్మెల్యే ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 13న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో విద్యావంతులు, మేధావులు తమ ఓటుహక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలన్నారు. 12, 18, 21, 34,35 వార్డులో వెన్నపూసకు మద్దతుగా ఆ వార్డు ఇన్‌చార్జ్‌ల ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమాల్లో మున్సిపల్ వైస్‌చైర్మన్ సాయిక్రిష్ణ, మున్సిపాలిటీ కన్వీనర్ యద్దారెడ్డి, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, వార్డు ఇన్‌చార్జిలు తదితరులు పాల్గొన్నారు.

భారీ మెజారిటీతో గెలిపించాలి

బద్వేలు: వైఎస్సార్‌సీపీ మద్దతుతోఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న గ్రాడ్యుయేట్ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి రామచంద్రారెడ్డిలను ఓటర్లు అత్యధిక మెజారిటీతో గెలిపించాలని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి సలహాదారు నాగార్జునరెడ్డి కోరారు. ఆయన శుక్రవారం గానుగపెంట, ఎస్వీ రామాపురం, చల్లగిరిగెల, సిద్దవరం, చిన్న యర్రశాల, టేకూరుపేట, పుల్లివీడు పంచాయతీల్లో ప్రచారం నిర్వహించారు.

'వెన్నపూస'కు ప్రథమ ప్రాధాన్యత ఓటు వేయాలి

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపరిచిన అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డికి ప్రథమ ప్రాధాన్యత ఓటు వేయాలని రాష్ట్ర సగర కార్పొరేషన్ చైర్మన్ రమణమ్మ, గిద్దలూరు నియోజకవర్గ పరిశీలకుడు బంగారు శీనయ్య కోరారు. బద్వేలు పట్టణంలోని ఎన్జీఓ కాలనీలోని తమ కార్యాలయంలో మున్సిపాలిటీలోని ఆరో వార్డులోని పట్టభద్రుల ఓటర్లతో సమావేశం నిర్వహించారు. బ్యాలెట్ నమూనాను వారికి చూపించి అవగాహన కల్పించడంతో పాటు ప్రథమ ప్రాధాన్యత ఓటు వేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ కన్వీనర్ యద్దారెడ్డి, ఇతర నాయకులు పాల్గొన్నారు.

అట్లూరు : పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎన్నికలలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి గెలుపే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ నాయకులు కార్యకర్తలు కృషి చేయాలని అటవీశాఖ కార్పొరేషన్ డైరెక్టర్ రొండా మల్లికార్జునరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని ముత్తుకూరు సచివాలయంలో ప్రచారం చేశారు. కార్యక్రమంలో సచివాలయాల మండల కన్వీనరు మణ్యం మల్లికార్జునరెడ్డి, పొన్న ఓబుల గోపిరెడ్డి స్కూల్ కరస్పాండెంట్ బ్రహ్మానందరెడ్డి, మండల నాయకులు పాల్గొన్నారు.

గోపవరం : పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూసరవీంద్రారెడ్డికి మద్దతుగా వైఎస్సార్‌సీపీ నాయకులు విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. శుక్రవారం మండలంలోని కాలువపల్లె, గోపవరం గ్రామ పంచాయతీల పరిధిలో మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ గోపవరంమల్లికార్జునరెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ పుల్లయ్యలు స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి గ్రాడ్యుయేట్ ఓటర్లను కలుసుకుని మొదటి ప్రాధాన్యత ఓటును వేయాలని అభ్యర్థించారు.

కాశినాయన : పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డికి మద్దతు పలికి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని జెడ్పీటీసీ సత్యనారాయణరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ విశ్వనాథరెడ్డిలు తెలిపారు. శుక్రవారం సాయంత్రం ఇటుకులపాడు, సావిశెట్టిపల్లె గ్రామాల్లో పట్టభద్రుల ఓటర్ల ఇంటింటికి వెళ్ళి ప్రచారం నిర్వహించారు.

బ్రహ్మంగారిమఠం : 13న జరగనున్న పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపరుస్తున్న అభ్యర్థులు వెన్నపూస రవీంద్రారెడ్డి, రామచంద్రారెడ్డిలను గెలిపించాలని శుక్రవారం ఎంపీపీ సి.వీరనారాయణరెడ్డి, జెడ్పీటీసీ ఎం.రామగోవిందరెడ్డిలు మండలంలో ప్రచారం నిర్వహించారు. బి.మఠంలో జెడ్పీ ఉన్నత పాఠశాల, ప్రైవేట్ పాఠశాలలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి ఆదేశాల మేరకు బి.మఠం మండలంలో గత నాలుగు రోజులుగా ప్రతి గ్రామంలోని పట్టభద్ర, ఉపాధ్యాయ ఓటర్ల ఇంటికి వెళ్లి ఓటు వేయాలని అభ్యర్థించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మేకల రత్నకుమార్ యాదవ్, సింగల్ విండో అధ్యక్షుడు నేలటూరు సుబ్బారెడ్డి, మండల ఎన్నికల కన్వీనర్ కూనపులి రాజానాయుడు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలని వినతి

బద్వేలు అర్బన్ : విశ్రాంత ఉద్యోగుల పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం ఆ సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధకు వేరువేరుగా వినతిపత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ మీనాక్షిరెడ్డి, కార్యదర్శి కత్తిబ్రహ్మయ్య మాట్లాడుతూ ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులకు రావాల్సిన బకాయిలను వెంటనే విడుదల చేయించడంతో పాటు ప్రతి నెలా 1వ తేదీన పెన్షన్ చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కోశాధికారి గంగన్న, అసోసియేట్ అధ్యక్షుడు గంజికుంట పుల్లయ్య, ఆర్గనైజింగ్ కార్యదర్శి పిచ్చయ్య, ఉపాధ్యక్షులు ఆనందరావు, ప్రసాద్, రామసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలి



మాట్లాడుతున్న ఆర్డీఓ శ్రీనివాసులు

ప్రొద్దుటూరు : ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన పోలింగ్ కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేయాలని జమ్మలమడుగు ఆర్డీఓ శ్రీనివాసులు తెలిపారు. స్థానిక ఉపవిద్యాశాఖాధికారి కార్యాలయంలో శుక్రవారం రెవెన్యూ అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి 15 పోలింగ్ బూత్‌లు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఒక బూత్‌ను పట్టణంలో ఏర్పాటు చేశామన్నారు. 16 బూత్‌లకు 32 మంది వీఆర్‌ఓలను నియమించామన్నారు. పోలింగ్ అధికారులకు అనువుగా ఉండేలా తాగునీరు, భోజన వసతి కల్పించాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల్లో లైటింగ్ ఏర్పాటు చేయాలని తెలిపారు. ముందు రోజు నుంచి పోలింగ్ పూర్తి అయ్యేంత వరకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని చెప్పారు. సమావేశంలో తహసీల్దార్ నజీర్ అహ్మద్, డిప్యూటీ తహసీల్దార్లు సుదర్శన్, సతీష్, మనోహర్‌రెడ్డి, ఆర్‌ఐ నాగమోహన్‌రెడ్డి, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

హెచ్3ఎన్2 ఇన్‌ఫ్లూయెంజాపై అవగాహన

ప్రొద్దుటూరు కల్చరల్ : హెచ్3ఎన్2 ఇన్‌ఫ్లూయెంజాపై ప్రజల్లో అవగాహన పెరగాలని జన విజ్ఞాన వేదిక పట్టణాధ్యక్షుడు డాక్టర్ శివారెడ్డి, జిల్లా ఆరోగ్య విభాగం కన్వీనర్ డాక్టర్ చక్రధర్ తెలిపారు. శుక్రవారం స్థానిక జిల్లా ప్రభుత్వాస్పత్రిలో హెచ్3ఎన్2 ఇన్‌ఫ్లూయెంజాపై అవగాహన పత్రాలను వారు విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలో ఎక్కువగా ఈ ఫ్లూ వేరియెంట్ ఉందని, ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గొంతు నొప్పి, 3 నుంచి 5 రోజులు జ్వరంతోపాటు మూడు వారాలు దగ్గు ఉంటుందని తెలిపారు. హ్యాండ్ వాష్ చేసుకోవాలని, మాస్క్ ధరించాలని, గుంపులకు దూరంగా ఉండాలని, నీరు ఎక్కువ తాగాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో జేవీవీ రాష్ట్ర కార్యదర్శి తవ్వా సురేష్, జిల్లా నాయకురాలు ఉషారాణి, పోలంకి శ్రీరాములు, పట్టణ ప్రధాన కార్యదర్శి సునీత, సూర్యనారాయణరెడ్డి, దస్తగిరి, చంద్రశేఖర్ రావు, లోకేష్, సుబ్బరాయుడు పాల్గొన్నారు.



హెచ్3ఎన్2 ఇన్‌ఫ్లూయెంజాపై అవగాహన పత్రాలు విడుదల చేస్తున్న జేవీవీ నాయకులు

యాజమాన్య పద్ధతులతో నాణ్యమైన దిగుబడులు



రైతుకు సాయిల్ హెల్త్ కార్డును అందజేస్తున్న శాస్త్రవేత్తలు

మైదుకూరు : పంటల సాగులో మేలైన యాజమాన్య పద్ధతులతో నాణ్యమైన దిగుబడులను సాధించవచ్చని అనంతరాజుపేట ఉద్యాన కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం.బాలకృష్ణ తెలిపారు. మైదుకూరు మండలం వనిపెంట కృషి విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం రైతు సదస్సు నిర్వహించారు. సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ బాలకృష్ణ మాట్లాడుతూ యాజమాన్య పద్ధతుల్లో చీడ పీడలు, తెగుళ్లను గుర్తించి వాటి నిర్మూలనకు చర్యలు చేపట్టాలని సూచించారు. కేవీకే అధిపతి, శాస్త్రవేత్త డాక్టర్ శ్రీవిద్యారాణి మాట్లాడుతూ విస్తరణ కార్యక్రమాలు రైతులకు ఉపయుక్తమవుతాయన్నారు. శాస్త్రవేత్త డాక్టర్ హర్షిత మాట్లాడుతూ సేంద్రియ వ్యవసాయం వల్ల కలిగే లాభాలను వివరించారు. శాస్త్రవేత్త డాక్టర్ ఫిరోజ్ హుస్సేన్ మాట్లాడుతూ ఉద్యాన కళాశాల విద్యార్థులు నాలుగు నెలలుగా కేవీకే పరిధిలోని రైతుల పొలాల్లో పొందుతున్న ఒకేషనల్ ట్రైనింగ్ గురించి వివరించారు. ఉద్యాన కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ చంద్రశేఖర్ రెడ్డి, రైతుల వద్ద నేరుగా నేర్చుకున్న అంశాలు విద్యార్థులకు ఉపయోగపడతాయన్నారు. సదస్సులో రైతు నాయకుడు బీపీ ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతులకు సాయిల్ హెల్త్ కార్డులను అందజేశారు.

సావిత్రిబాయి పూలే మహిళా లోకానికే ఆదర్శం



సావిత్రిబాయి పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

బద్వేలు అర్బన్ : మహిళా లోకానికే ఆదర్శం సావిత్రిబాయి పూలే అని మున్సిపల్ వైస్‌చైర్మన్ వై.గోపాలస్వామి, మహాత్మా జ్యోతిరావ్ పూలే ఆశయ సాధన సమితి చైర్మన్ బి.గురుమూర్తి పేర్కొన్నారు. సావిత్రిబాయి వర్ధంతి సందర్భంగా శుక్రవారం స్థానిక సిద్ధవటంరోడ్డులోని ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత ప్రప్రథమ మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి అన్నారు. ప్రతి మహిళ ఆమెను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఆమె జీవిత చరిత్రను పాఠ్యాంశంగా ఏర్పాటు చేయాలన్నారు. పూలే విగ్రహ నిర్మాణ కమిటీ వైస్‌చైర్మన్ వజ్రాలవెంకటస్వామి, బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు పి.అనిల్‌కుమార్‌రాజు, ఆవాజ్ రాష్ట్ర కమిటీ సభ్యులు అన్వర్‌బాషా, పట్టణ అధ్యక్షులు సత్తార్, బీసీ నాయకులు జయరాములు, రాజగోపాల్, ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మహబూబ్‌సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యుల అభివృద్ధికి అన్నివిధాలా సహకారం



కన్యకాపరమేశ్వరి షాపింగ్ కాంప్లెక్స్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ

బద్వేలు అర్బన్ : పట్టణంలోని ఆర్యవైశ్యుల అభివృద్ధికి తమ వంతుగా అన్నివిధాలా సహాయ సహకారాలు అందిస్తామని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ పేర్కొన్నారు. స్థానిక మైదుకూరు రోడ్డులో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన శ్రీకన్యకాపరమేశ్వరి షాపింగ్ కాంప్లెక్స్‌ను శుక్రవారం వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్యవైశ్యులు వ్యాపార రీత్యా మరింత అభివృద్ధి చెందేందుకు షాపింగ్ కాంప్లెక్స్ ఎంతగానో దోహదపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఏపీ ఎన్విరాన్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గుబ్బాచంద్రశేఖర్, అడా చైర్మన్ గురుమోహన్, మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్ రెడ్డి, ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మిట్టాకరుణాకర్, మున్సిపల్ వైస్‌చైర్మన్ ఆర్.వి.సాయిక్రిష్ణ, కౌన్సిలర్ చెవులవెంకటేశ్వర్లు, ఆర్యవైశ్య మహాసభ లీగల్ సెల్ అడ్వైజర్ పి.వి.ఎస్.ప్రసాద్, కె.వి.సుబ్బారావు, కొలిశెట్టినాగరాజ పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణకు చర్యలు



మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ చంద్రహాసరెడ్డి

బద్వేలు అర్బన్ : పిల్లల్లో అనారోగ్యానికి కారణమయ్యే నులిపురుగుల నివారణకు చర్యలు తీసుకుంటున్నాం. ఇందుకోసం ఈ నెల 14న జరిగే నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ వై.చంద్రహాసరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక తొట్టిగారిపల్లె పీహెచ్‌సీ ఆవరణలో వైద్యాధికారులు, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నులిపురుగులు ఉన్న పిల్లల్లో రక్తహీనత, పోషకాల లోపం, ఆకలి మందగించడం, బరువు తగ్గడం లాంటి లక్షణాలు కనిపిస్తాయన్నారు. ఇందుకోసం తల్లిదండ్రులు తమ పిల్లలకు తప్పనిసరిగా ఆల్బెండజోల్ మాత్రలు మింగించాలని కోరారు. సమావేశంలో వైద్యాధికారులు డాక్టర్ జోత్స్నస్వర్ణలత, డాక్టర్ వినయ్‌కుమార్, హెల్త్ ఎడ్యుకేటర్ వెంగయ్య, హెల్త్ సూపర్‌వైజర్ వెంకటమ్మ, హెల్త్ అసిస్టెంట్ జనార్దన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

నులిపురుగులను నిర్మూలిద్దాం



మాట్లాడుతున్న డివిజనల్ లెవెల్ అభివృద్ధి అధికారి సుబ్రహ్మణ్యం



ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తున్న అధికారులు

ప్రొద్దుటూరు : ఈ నెల 14 నుంచి 18వ తేదీ వరకు నిర్వహించే జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డివిజనల్ లెవెల్ అభివృద్ధి అధికారి సుబ్రహ్మణ్యం తెలిపారు. తద్వారా నులిపురుగులను నిర్మూలిద్దామని పేర్కొన్నారు. గోపవరంలోని మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంపై టాస్క్‌ఫోర్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల వద్ద ఏడాది నిండిన పిల్లల నుంచి 19 ఏళ్ల వయసు గల పిల్లలందరికీ ఆల్బెండజోల్ మాత్రలను మింగించాలని తెలిపారు. కామనూరు, కల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు డాక్టర్లు హనీఫ్‌బాబా, శివప్రసాద్ మాట్లాడుతూ ఎలాంటి అపోహలు లేకుండా అందరికీ మాత్రలు మింగించాలని తెలిపారు. ఈ మాత్రల వల్ల పిల్లల ఆరోగ్యాన్ని కాపాడిన వారమవుతామని పేర్కొన్నారు. 89 అంగన్‌వాడీ సెంటర్లకు, 85 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు 22 వేల మాత్రలను పంపిణీ చేశామన్నారు. ఒకటి నుంచి రెండేళ్ల పిల్లలకు సగం మాత్రను పొడి చేసి నీళ్లతో కలిపి ఇవ్వాలని సూచించారు. రెండు నుంచి మూడేళ్ల పిల్లలకు ఒక మాత్రను పొడి చేసి నీళ్లలో కలిపి తాగించాలని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ నజీర్ అహ్మద్, ఎంపీడీఓ ఉపేంద్ర, సీహెచ్‌ఓ కృష్ణమ్మ, హెచ్‌ఈ శోభారాణి, హెచ్‌ఈఓ వెంకటేశ్వర్లు, సూపర్‌వైజర్ వరప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

14న నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం

రాజుపాళెం : ఈనెల 14న జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ సయ్యదున్నీసా, పీహెచ్‌సీ వైద్యురాలు మంజుల తెలిపారు. రాజుపాళెంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని పాఠశాలల్లోని విద్యార్థులకు మార్చి 14న నులిపురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని నిర్వహించి, వారికి మందులు వేయాలని సూచించారు. ఆరోగ్యవంతమైన పిల్లల కోసం నులిపురుగులను నులిమేద్దామని, అందరూ కలిసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. అక్కడే ఉన్న ఉపాధ్యాయులకు నులిపురుగుల నిర్మూలనకు సంబంధించి ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ పార్వతమ్మ పీహెచ్‌ఎన్ విమలమ్మ, ఎంపీహెచ్‌ఈఓ రవిశంకర్‌రాజు, సూపర్‌వైజర్ లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌పై నమ్మకంతోనే పెట్టుబడుల వెల్లువ

ఎమ్మెల్యే రఘురామిరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

ఖాజీపేట : రాష్ట్రానికి 13లక్షల కోట్లు పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు ఒప్పందం కుదుర్చుకోవడం సీఎం జగన్‌పై ఉన్న నమ్మకంతోనే సాధ్యమైందని ఎమ్మెల్యే రఘురామిరెడ్డి అన్నారు. ఖాజీపేటలో ఎంపీపీ అబుబకర్ సిద్ధిక్ కార్యాలయంలో మండలంలోని నాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. పార్టీ మద్దతుదారుడైన వెన్నపూస రవీంద్రారెడ్డి గెలుపుపై చర్చించారు. ప్రచారం తీరు తెన్నులను అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఒక్కరూ ప్రతి ఓటరును కలవాలని అభ్యర్థి గెలుపు కోసం కృషిచేయాలని సూచించారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 13లక్షల కోట్ల పెట్టుబడుల కోసం ఎంఓయూలు జరగడం హర్షణీయం అన్నారు. సంక్షేమం, అభివృద్ధిని సహించలేని టీడీపీ విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. గ్రామాల్లో సచివాలయ వ్యవస్థతోపాటు రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. నాడు–నేడు కార్యక్రమాల ద్వారా ప్రభుత్వ ఆసుపత్రులు, అలాగే పాఠశాలల రూపురేఖలు మార్చుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ అబుబకర్ సిద్దిక్, ఏపీఐఐసీ డైరెక్టర్ గంగాధర్‌రెడ్డి, జెడ్పీ కో–ఆప్షన్ సభ్యుడు అచ్చుకట్ల కరీముల్లా, అగ్రహారం సొసైటీ అధ్యక్షుడు రాఘవరెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, చెన్నముక్కపల్లె సర్పంచ్ చంద్రశేఖర్, కొత్తపేట ఎంపీటీసీ చంద్రశేఖర్ రెడ్డి, కనపర్తి సుబ్బారెడ్డి, పెద్దిరెడ్డితోపాటు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలపై సమీక్ష

చాపాడు : ఈ నెల 13న జరుగనున్న పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎన్నికలలో మండలంలోని పట్టభద్రులందరూ తమ ఓటు హక్కు వినియోగించుకునేలా చూడాలని మైదుకూరు నియోజకవర్గ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఇండేన్ గ్యాస్ వద్ద శుక్రవారం సాయంత్రం ఎమ్మెల్యే రఘురామిరెడ్డి ఎమ్మెల్సీ ఎన్నికలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలవ్యాప్తంగా 1071 మంది పట్టభద్రులు ఉన్నారని వీరందరూ ఓటు హక్కులు వినియోగించుకునేలా గ్రామాల్లోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు చొరవ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు తెలిదేల లక్షుమయ్య, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రాజశేఖర్‌రెడ్డి, గ్రామ సచివాలయ మండల కన్వీనర్ రామోహన్‌రెడ్డి, నాయకులు మాజీ జెడ్పీటీసీ బాలనరసింహారెడ్డి, పీవీ రమణారెడ్డి, శాంతురాజు, జయరామిరెడ్డి, సీవీ సుబ్బారెడ్డి, మదూరు వినయ్‌కుమార్‌రెడ్డి, రమణయ్య, ప్రసాద్, వెంకటసుబ్బారెడ్డి, జయరాజు తదితరులు పాల్గొన్నారు.

మండల టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశం

దువ్వూరు : మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో శుక్రవారం ఎంపీడీఓ జగదీశ్వరరెడ్డి ఆధ్వర్యంలో జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమంపై మండల టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు సమీర మాట్లాడుతూ ప్రభుత్వం రెండు పర్యాయాలు నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం చేపడుతోందని తెలిపారు. ఏడాది నుంచి రెండేళ్లు గల పిల్లలకు ఆల్‌బెండజోల్ సగం మాత్ర, రెండు నుంచి 19 ఏళ్లున్న వారికి ఒక మాత్ర మింగించాలని సూచించారు. 34 శాతం మంది పిల్లలు రక్తహీనతతో బాధపడుతున్నారని, దీనికి కారణం నులిపురుగులేనని పేర్కొన్నారు. ఎంపీడీఓ జగదీశ్వరరెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయులు పాఠశాలకు వచ్చే ప్రతి విద్యార్థికి ఆల్‌బెండజోల్ మాత్రలను మింగించాలని సూచించారు. వంద శాతం విద్యార్థులకు మాత్రలను అందించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.